నరసింహారావుపాలెంలో పిడుగు

ఇంట్లో పాడైన విద్యుత్ సామగ్రి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లు పడింది. గాలి బలంగా వీచింది. గ్రామంలోని అల్లాడ చెన్నారావు ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో ఇంట్లో ఉన్న విద్యుత్ మీటర్ పెట్టె, చిచ్చు బోర్డులు, విద్యుత్ వైరింగ్, టీవీ, ఎలక్ట్రికల్ సామగ్రి పూర్తిగా కాలిపోయింది.పిడుగు పాటుకు కుటుంబ సభ్యులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. పిడుగు పడిన విషయాన్ని తెలుసుకున్న టిడిపి గ్రామ నాయకులు పుచ్చకాయల నోబుల్ రెడ్డి, యువ నాయకులు కట్టా నాగ దుర్గారావు చెన్నారావు కుటుంబాన్ని పరామర్శించారు.

తాగునీటి నాణ్యత ఎంత..!

విచ్చలవిడిగా తాగునీటి ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు
తాగునీరు నాణ్యత ప్రమాణాలపై నీలినీడలు
అధికారుల పర్యవేక్షణ కరువు
సంబంధం లేదంటున్న పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు
రెండు జిల్లాల్లో వందల సంఖ్యలో తాగునీటి ప్లాంట్లు
20 లీటర్లు నీరు రూ. పది నుంచి రూ. 25 వరకూ వసూలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజల జీవనానికి ప్రధాన ఆధారమైన తాగునీటిపై రెండు జిల్లాల్లో ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడింది. ముఖ్యంగా ప్రయివేటు ఆధ్వర్యంలో నడిచే తాగునీటి ఆర్ఒ ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. గ్రామాల్లో విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న తాగునీటి ఆర్ఒ ప్లాంట్లు సరఫరా చేసే తాగునీరు నాణ్యతా ప్రమాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. నాణ్యతను పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి నెలకొంది. దీంతో నాణ్యతలేని నీటిని తాగుతున్న జనం అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న పరిస్థితి కొనసాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు ప్రతి గ్రామంలోనూ ఒకటి, అంతకు మించి ఆర్ఒ ప్లాంట్లు ఉన్న పరిస్థితి ఉంది. దీంతో రెండు జిల్లాల్లో వందల సంఖ్యలో తాగునీటి ఆర్ఒ ప్లాంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్ఒ ప్లాంట్లు ఎన్ని కొనసాగుతున్నాయన్నా వివరాలు పంచాయతీ శాఖ వద్ద లేవంటే ఆశ్చర్యపోక తప్పదు. తాగునీటి ఆర్ఒ ప్లాంట్లలో 20 లీటర్ల నీటికి రూ.పది నుంచి రూ.25 వరకూ వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. కూలింగ్ వాటర్ టిన్నులకైతే రూ.30 వరకూ తీసుకుంటున్నారు. ఆర్ఒ ప్లాంట్లలో తాగునీటికి సంబంధించి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. నిబంధనలను సక్రమంగా పాటించడం లేదంటూ జనం గగ్గోలు పెడుతున్న పరిస్థితి నెలకొంది. బోర్ల నుంచి నేరుగా తాగునీటిని తోడేసి టిన్నులో నింపేసి ఇచ్చేస్తున్నారంటూ జనం చెబుతున్న పరిస్థితి. జనం నిలదీసినా సమాధానం చెప్పని పరిస్థితి కొనసాగుతోంది. తాగునీటి ఆర్ఒ ప్లాంట్ల సమస్యపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో తాగునీటి ఆర్ఒ ప్లాంట్లు పెట్టాలంటే పంచాయతీ అనుమతి ఉండాలి. పట్టణాల్లో అయితే మున్సిపాల్టీ అనుమతి ఉండాల్సి ఉంది. ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతిస్తున్న పంచాయతీ, మున్సిపాల్టీలు తాగునీటి నాణ్యత గురించి పట్టించుకోవడం లేదు. తాగునీటి నాణ్యత ఆర్‌డబ్ల్యుఎస్ శాఖకు సంబంధించందంటూ సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆర్‌డబ్ల్యు ఎస్ అధికారులు మాత్రం తాగునీటి ఆర్ఒ ప్లాంట్లు తమ పరిధిలోకి రావంటూ చెబుతున్న పరిస్థితి. ఆర్ఒ ప్లాంట్లలో తాగునీటి నాణ్యతను ఎవరు పరిశీలిస్తారో తెలియని పరిస్థితి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వాటర్ ఆర్ఒ ప్లాంట్లలో తాగునీటి నాణ్యత సరిగ్గాలేని పరిస్థితి నెలకొంది. వందల సంఖ్యలో కొనసాగుతున్న తాగునీటి ప్లాంట్లను ప్రభుత్వం పటించుకోకపోవడం ఏమిటో ఏ ఒక్కరికీ అర్ధంకావడం లేదు. తాగునీటి ఆర్ఒ ప్లాంట్లలో తనిఖీలు మచ్చుకకు కూడా లేకుండా పోయాయి.

తాగునీటి ఆర్ఒ ప్లాంట్ల నీరే అత్యధికంగా వినియోగం

పంచాయతీలు సరఫరా చేసే తాగునీరు సరిగ్గా లేకపోవడంతో రెండు జిల్లాల ప్రజానీకం నూటికి 80 శాతం మంది ఆర్ఒ ప్లాంట్లలో నీటినే తాగుతున్నారు. రోజుకు రూ. 20 నుంచి రూ.40 తాగునీటికే ఖర్చుపెడుతున్నారు. నెలకు దాదాపు రూ.వెయ్యి వరకూ తాగునీటికి ఖర్చవుతున్న పరిస్థితి ఉంది. డెల్టా ప్రాంతాల్లో తాగునీటి వనరులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆక్వా చెరువుల నీటిని పంట కాలువల్లోకి వదలడంతో తాగునీరు పూర్తిగా కలుషితంగా మారింది. రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షలకు పైగా ఎకరాల్లో ఆక్వా చెరువులు సాగువుతున్నాయి. 80 శాతంపైగా ఆక్వా చెరువులు నిబంధనలకు విరుద్ధంగానే తవ్వకాలు సాగాయి. చేపలు, రొయ్యలు సాగుచేసే చెరువుల్లో యాంటిబయోటిక్స్ వంటి మందులను సైతం పెద్దఎత్తున వినియోగిస్తున్న పరిస్థితి ఉంది. కోళ్ల వ్యర్థాలను సైతం ఆక్వా చెరువుల్లో కలుపుతున్నారు. ఆ నీటినే పంట కాలువల్లోకి వదులుతున్నారు. పంచాయతీలు ఆ నీటినే రక్షిత నీటి ట్యాంకుల్లో నింపుతున్నాయి. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల పర్యవేక్షణ చేస్తారు. ఫిల్టర్ బెడ్‌లో సరిగా లేకపోవడంతో తాగునీటి నాణ్యత లేకుండా పోతోంది. కొన్నిచోట్ల పసర్ల కంపుతో ఉన్న నీటినే పలు పంచాయతీల్లో సరఫరా చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. దీంతో జనం ఆర్ఒ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నారు. అక్కడ కూడా తాగునీటి నాణ్యతపై నీలినీడలు కమ్ముకోవడంతో జనానికి ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

నాణ్యతపై మాకు సంబంధం లేదు..

జి.త్రినాథ్‌బాబు, ఆర్‌డబ్లూఎస్ ఎస్ఇ, ఏలూరుజిల్లా

గ్రామాల్లో ఏర్పాటు చేసే తాగునీటి ఆర్ఒ ప్లాంట్లకు పంచాయతీ ఆధ్వర్యంలోనే అనుమతిలిస్తారు. తాగునీటి నాణ్యతకు సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్‌కు సంబంధం లేదు. పంచాయతీ శాఖ అధికారులే చూసుకోవాలి.

దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి.. సమన్వయంతో పనిచేయాలి..

కొల్లేరు ప్రజలను మానవతా దృక్పథంతో చూడాలి
ఎంపీ మహేష్‌కుమార్, ఎంఎల్ఎ ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి

మాట్లాడుతున్న ఎంపీ, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు

దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో దెందులూరు నియోజకవర్గ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ మహేష్ కుమార్, ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్, పశుసంవర్ధక శాఖ, పిఆర్, ఆర్‌అండ్‌బి, విద్యుత్, రెవెన్యూ, తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సుధీర్ఘ సమీక్ష జరిగింది. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ఎంపీ ల్యాడ్స్‌కు సంబంధించి 2014-19 చేపట్టిన పనులకు గాను వివరాలు, 2019-24 సంబంధించిన పనులు వివరాలపై సమీక్షిస్తూ పనులు చేపట్టి అసంపూర్తిగా మిగిలిన పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొల్లేరు రైతుల విషయంలో మానవతా దృక్పథంతో అటవీశాఖ అధికారులు వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజలు ఇబ్బంది పడే ఏ చర్యలూ చేపట్టొద్దని సూచించారు. కొల్లేరుకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా తనవంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో నియోజవర్గ అభివృద్ధికి అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న కార్యక్రమాలకు తోడు మరిన్ని అభివృద్ధి పనులు జరగాలన్నదే తన లక్ష్యమన్నారు. జనుము, జీలుగ విత్తనాలు సరఫరాను ఎక్కువ మొత్తంలో చేపట్టి సంబంధిత వివరాలు రైతు సేవాకేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు నియోజకవర్గం నాలుగు మండలాల్లో 5 వేల ఎకరాల చొప్పున డెమో ప్లాట్లు వేసేందుకు భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఒక మోడల్‌గా ప్రకృతి వ్యవసాయాన్ని దెందులూరు నియోజకవర్గంలో తీసుకురావాలని సూచించారు. మత్స్యశాఖకు సంబంధించి ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చే పథకాలపై విస్తృతంగా అవగాహన పర్చాలన్నారు. కొత్త సొసైటీలు ఏర్పాటుచేసి ఎస్‌సి, ఎస్‌టిలకు చెరువులు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటే వారికి ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. పెదవేగి మండలంలో దుగ్గిరాల, వంగూరు, దొండపాడు, పినకడిమి, జానంపేట తదితర గ్రామాల్లో సుమారు 23 ఎకరాలు ఇరిగేషన్ స్థలం ఖాళీగా ఉందని, అందుకు సంబంధించి ఎన్‌ఒసి సంబంధిత శాఖ ఇస్తే సిసిఎల్ఎకు ప్రతిపాదనలు పంపి ఇళ్ల స్థలాలకు అవసరమైన భూమిని సమకూర్చే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. గుండుగొలను నుంచి ఏలూరు గోదావరి కాలువ చివరి వరకు కొంతమేర పూడికతీసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, తదితర శాఖల ద్వారా అమలవుతున్న ఆయా పథకాల వివరాలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జనుము, జీలుగ గ్రీన్ మెన్యూర్ సంబంధించి 10 వేల మెట్రిక్ టన్నులు కేటాయించగా ఇప్పటికే 4 వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు అందాయని, మిగిలినవి కూడా వారం రోజుల్లోపు రానున్నాయని తెలిపారు. దెందులూరు నియోజకవర్గంలో 1800 హెక్టార్లలో ఉధ్యాన పంటల విస్తరణకు లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. ఆయిల్ పామ్ పంట విస్తీర్ణానికి రైతుల్లో అవగాహన కలిగించేందుకు వర్క్‌షాప్ నిర్వహించాలని ఉద్యాన, ఎపిఎంఐపి, డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు జిల్లాలో చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, సిపిఒ వాసుదేవరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా, పశు సంవర్ధకశాఖ జెడి గోవిందరాజులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల్లోని 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం ద్వారా కార్మిక హక్కులను హరించివేస్తోందని కార్మిక సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకించారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను ఏలూరు జిల్లాలో జయప్రదం చేయడం కోసం గురువారం ఏలూరు సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో కార్మిక సంఘాల జిల్లా సదస్సు జరిగింది. సదస్సుకు ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణం విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని నాయకులు కోరారు. 20న సమ్మె సందర్భంగా పట్టణ మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో వందల మంది ఉద్యోగ కార్మికులతో ప్రదర్శన, సభలు నిర్వహించాలని నాయకులు కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం మార్పు పేరుతో కాలరాస్తోందని వారు విమర్శించారు. 78 సంవత్సరాల స్వాతంత్ర భారత్‌లో ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను కార్పొరేట్లకు, ప్రయివేటు వ్యక్తులకు కారుచౌకగా మోడీ ప్రభుత్వం అప్పగిస్తోందని తెలిపారు. అందులో భాగంగానే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి ప్రయత్నిస్తోందన్నారు. సమ్మెకు ఇప్పటి నుంచే కార్మిక సంఘాలు కార్మికులకు తెలియజేస్తూ సమ్మె జయప్రదానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. సదస్సు ముందుగా కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో మరణించిన దేశ పౌరులకు సంతాపం తెలిపింది. సదస్సుకు ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎ.అప్పలరాజు స్వాగతం పలకగా సిఐటియు నాయకులు జె.గోపీ వందన సమర్పణ చేశారు. సదస్సులో సిఐటియు నాయకురాలు కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. యూనియన్ ప్రెసిడెంట్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, లేదా ఆప్కాస్‌ను కొనసాగించాలని కోరారు. ఈ ధర్నాలో నాయకులు గోపీ, సుభాని పాల్గొన్నారు.

కొత్త రైస్ కార్డులకు నమోదు చేసుకోండి

కొత్త కార్డులు, మార్పులు, చేర్పులు, చిరునామా మార్చుకోవచ్చు
రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూతన రైస్ కార్డులు జారీతో పాటు మార్పులు, చేర్పులకు సంబంధించి మొత్తం ఆరు రకాల సేవలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన రైస్ కార్డుల జారీ, కార్డుల విభజన, చిరునామా మార్పు, సభ్యులను చేర్చడం, తొలగించడం, కార్డులను సరెండర్ చేయడం మొత్త ఆరు రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైస్ కార్డులో తప్పుడు ఆధార్ నెంబర్ సీడింగ్‌ను సరిచేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. జూన్‌లో స్మార్ట్ కార్డు రూపంలో నూతన రైస్ కార్డుల జారీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని పేర్కొన్నారు. 2024 ఎన్నికల నేపథ్యంలో నూతన కార్డుల జారీని నిలిపివేయాలని భారత ఎన్నికల సంఘం గతేడాది మార్చిలో ఆదేశాలు జారీ చేసిందని, తదుపరి ఇకెవైసి తప్పనిసరిగా నమోదు చేయాలని సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు నూతన కార్డుల జారీకి అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటివరకు 94.4 శాతం మేర ఇకెవైసి ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో నూతన రైస్ కార్డుల జారీకి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మొత్తం 1,46,21,223 రైస్ కార్డులు ఉన్నాయని, ఈ కార్డుల ద్వారా దాదాపు 4,24,59,028 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలకు, 80 ఏళ్లుపైపడిన వారికి ఇకెవైసి చేయాల్సిన అవసరం లేదనే వెలుసుబాటు కల్పించడంతో సుమారు 6,45,765 మందికి ఇకెవైసి చేయడం జరగలేదని తెలిపారు. అదే విధంగా ఇప్పటికే 3.94 లక్షల మంది తమ రైస్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రైస్ కార్డులను జారీ చేయనున్నట్లు తెలిపారు. ఆ కార్డులపై కుటుంబ సభ్యుల వివరాలన్ని ఉంటాయని, ఆ కార్డును స్కాన్ చేయగానే అన్ని వివరాలు కనిపిస్తాయని, డేటా బేస్‌కు ఈ కార్డును లింక్ చేయడంవల్ల సిస్టంలో ఆటోమేటిక్‌గా డేటా కూడా అప్‌డేట్ అవుతుందని తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆరు నెలల రేషన్ వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. స్మార్ట్ కార్డుతో దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. జిల్లాలో మొత్తం 6,20,146 రైస్ కార్డులు ఉన్నాయని, ఈ కార్డుల ద్వారా దాదాపు 17,31,461 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు.

చెరువులో ధాన్యం లారీ బోల్తా

500 బస్తాల ధాన్యం నీటమునక
అదే చెరువులో ఏప్రిల్ 26న తిరగబడిన మరో లారీ


కాకర్లమూడి చెరువులో తిరగబడిన ధాన్యం లారీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలం కాకర్ల మూడిలో ధాన్యం లారీ ప్రమాదవశాత్తు బుధవారం రాత్రి చెరువులో తిరగబడింది. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ముగ్గురు రైతులకు చెందిన 500 బస్తాలతో ముదినేపల్లి మండలం పెద్దపాలపర్రు రైస్ మిల్లుకు బయలుదేరిన లారీ రోడ్డుపై గోనె సంచులు ఉండడంతో రివర్స్ గేర్ వేయడంతో అదుపుతప్పి కాకర్లమూడి ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న చెరువులో తిరగబడింది. దీంతో ధాన్యంలోడు నీటిలో మునిగిపోయింది. సుమారు రూ.5 లక్షల విలువైన ధాన్యం నీటిపాలైంది. ట్రక్ షీట్ జనరేట్ అయ్యింది. ముదినేపల్లి మండలం పెదపాలపర్రు చంద్రావతి రైస్ అండ్ ఫ్లోర్ మిల్లుకు వెళ్తున్న కారణంగా నష్టం సంబంధిత మిల్లు యజమానే భరించాల్సి ఉందని, రైతులకు ఎలాంటి నష్టం లేదని జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామని తహశీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. గత నెల ఏప్రిల్ 26న ఇదే చెరువులో ధాన్యం లారీ తిరగబడడం ప్రజాశక్తి పాఠకలకు విదితమే. రోడ్డు మార్జిన్ పల్లంగా ఉండడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గట్టు పటిష్టం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్


మాట్లాడుతున్న రైతు సంఘం నేత శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉంగుటూరు

కేంద్ర ప్రభుత్వం రైతుల పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కైకరంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన సంఘం ముఖ్య నాయకులు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా కార్మికులు సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నారని, ఈ సమ్మెకు మద్దతుగా గ్రామీణ ప్రాంతాల్లో రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలపై నిరసన ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మోడీ ప్రభుత్వం రద్దు చేసిన చట్టాల స్థానంలో దొడ్డిదారిన డిజిటల్ అగ్రి మిషన్, నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్, బహుళ సహకార సంస్థల చట్టం పేరుతో కొత్త చట్టాలు తీసుకురావడం దుర్మార్గమని విమర్శించారు. వ్యవసాయ కార్పొరేటీకరణ విధానాలు ఆపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రైతులందరికీ వెంటనే అందించాలని కోరారు. నూతన కౌలు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని కోరారు. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. ఈ నెల 20న జరిగే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ చట్టాలపై అవగాహన అవసరం

ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ట్రాన్స్‌జెండర్స్ చట్టాలపై అవగాహన పొంది, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ట్రాన్స్ జెండర్స్‌కు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ చట్టాలపైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత న్యాయ సేవాధికార సంస్థలపై ఉందన్నారు. అందులో భాగంగా గురువారం ట్రాంజెండర్స్‌కు అవగాహనా సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. సమాజంలో స్త్రీ, పురుషులతో సమానంగా ట్రాన్స్‌జెండర్స్ కూడా సమాన హక్కులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అందరితో సమానంగా సంక్షేమ పథకాలను అందించాలని సూచించారు. వీరికి వసతి, రేషన్, వైద్యం, తదితర సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమాజంలో కొంతమంది ప్రజలు, అధికారులు తమను వేధిస్తున్నారని, వీరి నుంచి రక్షణ కల్పించాల్సిందిగా తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అండగా ఉంటామని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అదనపు డైరెక్టర్ బి.రామ్‌కుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పిఎన్‌వి.మునీశ్వరరావు, మాస్టర్ ట్రైనరు పి.రత్నరాజు, ట్రాన్స్ జెండర్స్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రారంభించిన డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పోలవరం

మండుటెండలో పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పోలవరంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాలసురేష్ బాబులు గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పోలవరం గ్రామానికి చెందిన రొక్కల శ్యాంబాబు, రొక్కాల మెహేష్ బాబు సోదరులు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. డిఎస్‌పి స్వయంగా మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి డిఎస్‌పి వెంకటేశ్వరరావు, సిఐ బాలసురేష్‌బాబు, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు స్వయంగా ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లిపోయినప్పటికీ, సొంత ఊరికి సేవ చేయాలనే తపనతో ఆలోచనతో రొక్కాల ఉదయ్ కిరణ్ చలివేంద్రం ఏర్పాటు చేయటానికి తోడ్పడడం హర్షనీయమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి, సమాజానికి మంచి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుమర్తి డేవిడ్ రాజు, గోకా హరికృష్ణ, పిల్లి నాగరాజు, పామర్తి ప్రకాష్, దోర్నాల గంగాధర్, పోలుమాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పన్ను చెల్లించాలి

ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రవాణా వాహనాలకు చెల్లించాల్సిన పన్ను గడువు ఏప్రిల్ 30వ తేదీతో ముగిసినప్పటికీ, కొందరు రవాణా వాహన యజమానులు త్రైమాసిక పన్ను చెల్లించకుండా వాహనాలను రహదారులపై తిప్పుతున్నారని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ గురువారం వరకు రవాణా వాహనాలపై 115 కేసులు నమోదు చేసి, రూ.7.53 లక్షలు అపరాధ రుసుంగా విధించినట్లు షేక్ కరీమ్ తెలిపారు. జిల్లాలో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పన్ను చెల్లించని రవాణా వాహనాలపై అపరాధ రుసుం విధించడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. వాహనంపై కేసు నమోదు చేస్తే పన్నుతో పాటు 200 శాతం అదనంగా చెల్లించాల్సి వస్తుందని, స్వచ్ఛందంగా పన్ను చెల్లిస్తే పన్నుతో పాటు 50 శాతం మాత్రమే అదనంగా చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు.

త్వరలోనే నిర్వాసితులకు ప్యాకేజీ

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం నిర్వాసితులకు త్వరలోనే ప్యాకేజీ అందించేలా చర్యలు తీసుకుంటామని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు చెప్పారు. మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎంఎల్‌ఎ బాలరాజు పాల్గొని అన్ని పంచాయతీల్లో ఉన్న సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఉన్న అధికారుల పని తీరు ఏ విధంగా ఉందో, నిర్లక్ష్యం వహిస్తూ విధుల పట్ల అలసత్వం వహిస్తున్న వారి వివరాలు నేరుగా తనకు తెలియజేయాలన్నారు. ఎన్నికల్లో నిర్వాసితులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నూరు శాతం అమలు చేస్తుందన్నారు. నిర్వాసితులకు ప్యాకేజీ అందించే విధంగా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడామని, త్వరలోనే ప్యాకేజీ అందుతుందని చెప్పారు. 2,944 నిర్వాసిత కుటుంబాల్లో 2785 కుటుంబాలకు నష్ట పరిహారం అందిందని, మిగిలిన 158 కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని, వారికి కూడా త్వరలోనే అందించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల కేంద్రంలో నివాసం ఉండాలని ఎంఎల్‌ఎ బాలరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పిఎస్.నరసింహారావు, తహశీల్దార్ రమేష్‌బాబు, జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, జనసేన కుక్కునూరు మండల ప్రెసిడెంట్ ములిశెట్టి యుగంధర్, వేలేరుపాడు ప్రెసిడెంట్ గణేశుల ఆదినారాయణ టిడిపి మండల ఉపాధ్యక్షులు మధుర వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మంగారత్నానికి ఉత్తమ ఎఎస్‌డబ్ల్యూఒ అవార్డు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎఎస్‌డబ్ల్యూఒ గోలి మంగారత్నం రాష్ట్ర ఉత్తమ ఎఎస్‌డబ్ల్యూఒ అవార్డు అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు స్వీకరించినట్లు ఆమె తెలిపారు. సాంఘిక సంక్షేమ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, సోషల్ వెల్ఫేర్ స్టేట్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీల చేతుల మీదుగా అవార్డు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ వేరేచోట ఏర్పాటు చేయాలి

అమ్మవారితోటవాసుల వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని అమ్మవారితోట ప్రాంతంలో రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సన్నాహాలు చేయడం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని స్థానికులు గురువారం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే కొద్దిపాటి రోడ్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ట్రాక్టర్లు, లారీలు వచ్చే పరిస్థితి ఉండదని వాపోతున్నారు. గృహ నిర్మాణాలు, అభివృద్ధి, వస్తువుల సరఫరా పలు ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ట్రాన్సాఫార్మర్ ఏర్పాటు కోసం ఇప్పటికే పిల్లర్లు ఏర్పాటు చేశారన్నారు. స్థానికుల ఇబ్బందులను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్‌ను దూరంగా ఏర్పాటు చేయాలని అమ్మవారి తోట ప్రాంత ప్రజానీకం కోరుతున్నారు. ఇప్పటికే నలువైపులా అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఉన్న కొద్దిపాటి విశాలమైన రోడ్డును కూడా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో కొత్త ఇబ్బందులు తీసుకురావద్దంటూ ప్రజలు మొరపెట్టుకుంటున్నారు.

నాటుసారానూ నిర్మూలించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారాను నిర్మూలించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.ప్రభుకుమార్ అన్నారు. చింతలపూడి స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నవోదయం 2.0 కార్యక్రమంపై తగు సూచనలు జారీ చేశారు. గ్రామాల్లో సారాను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సిఐ పి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సామాన్యుల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం పారదర్శకంగా ముందుకెళ్తోందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. గత వైసిపి హయాంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల్లో కూడా స్కామ్‌లు చేసిన నాయకులు ఇప్పుడు నీతి వాక్యాలు చెబుతున్నారన్నారు. ఏలూరు పవర్ పేటలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో గురువారం సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 23 మంది బాధితులకు రూ.17,72,581 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చంటి మీడియాతో మాట్లాడుతూ ఎన్‌టిఆర్ వైద్యసేవల పరిధిలోకిరాని అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి సిఎం సహాయ నిధి చెక్కులతో కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. వారి కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోందన్నారు. ఇదిచూసి ఓర్వలేకే వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో పేదల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిన మాజీ సిఎం జగన్ మళ్లీ పాదయాత్రల పేరుతో ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రజలంతా గర్వపడే రీతిలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. మంచి ప్రభుత్వంగా కూటమి ప్రజల గుండెల్లో సుస్థిరంగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎంఆర్‌పిఎస్ ఆగిరిపల్లి మండల నూతన అధ్యక్షులుగా నల్లమోతు సన్నీ మాదిగ, అధికార ప్రతినిధిగా బొబ్బర్ల సురేష్ మాదిగ ఎన్నికయ్యారు ఎంఆర్‌పిఎస్ మండల నూతన కమిటీ ఎన్నికను నూజివీడు నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు దుబ్బాకు దేవరాజు మాదిగ అధ్యక్షతన గురువారం ఆగిరిపల్లి మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా కొవ్వలి చినబాబు మాదిగ, లాము రమేష్ మాదిగ, పెనుముచ్చు శ్రీనివాస్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా ముల్లంగి జస్వంత్‌రావు మాదిగ, నల్లమోతు బాలస్వామి మాదిగ, దొండపాటి రామయ్య మాదిగ, కోశాధికారులుగా జుజ్జువరపు మల్లికార్జునరావు మాదిగ, పులపాక రాజాబాబు మాదిగ, భట్టుమర్తి రాము మాదిగ, కార్యదర్శులుగా తొమ్మండ్రు రాము మాదిగ, ముల్లంగి యోహన్ మాదిగ, నల్లమోతు బాలరాజు మాదిగ, నల్లమోతు కిశోర్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు ముళ్లపూడి వెంకటేశ్వరరావు మాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నాగేంద్రబాబు మాదిగ, ఎంఎస్‌పి నూజివీడు నియోజకవర్గ అధికార ప్రతినిధి నల్లమోతు కాంచనరావు మాదిగ, ఎంఎస్‌పి నాయకులు పి.లక్షణరావు మాదిగ, టి.నాగేశ్వరరావు మాదిగ, ఎ.నాగేశ్వరరావు మాదిగ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కుమార్తె కన్పించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తాటియాకులగూడెం గ్రామానికి చెందిన ఓ యువతి ఇంటర్ వరకు చదివి ఇంటి వద్ద ఉంటుంది. యువతికి ఆమె తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం యువతి తల్లిదండ్రులు పనికి వెళ్లారు. వారు వచ్చేసరికి తమ కుమార్తె కనిపించడంలేదు. చుట్టుపక్కలా, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కార్పొరేట్‌కు దీటుగా విద్య 'శ్రీసుగుణ' లక్ష్యం

జూనియర్, డిగ్రీ కళాశాల చైర్మన్ కారి రాజమణ

చైర్మన్ కారి రాజమణ

ప్రజాశక్తి - కలిదిండి

గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్య అందించడమే లక్ష్యంగా స్థానిక శ్రీ సుగుణ జూనియర్, డిగ్రీ కళాశాల కృషి చేస్తుందని చైర్మన్ కారి రాజమణి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. సరికొత్త ఆలోచనతో నిత్య నూతనమైన ఆచరణలో పటిష్ట విద్యావిధానమే శ్రీ సుగుణ కళాశాల అత్యద్భుత ఫలితాలకు నిదర్శనమన్నారు. ప్రతి రోజూ స్టడీ అవర్స్, క్రమం తప్పని టెస్ట్‌లతో పాటు ప్రతి శనివారం పరీక్షలు నిర్వహించి తల్లిదండ్రులకు తెలియజేయనున్నట్లు తెలిపారు. పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో విశ్లేషణాత్మక కౌన్సెలింగ్‌తో పాటు ప్రణాళిక ప్రకారం విద్య అందిస్తూ సాధారణ విద్యార్థిని అసాధారణ విద్యార్థిగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అపార అనుభవం ఉన్న అధ్యాపకులచే విద్యాబోధన, వారి పర్యవేక్షణలో రీడింగ్ క్లాస్‌లు జరుపు తున్నామన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ కోసం అధునాతన ల్యాబరేటరీ సౌకర్యం ఉందన్నారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి, హెచ్ఇసి గ్రూపులు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో బోధన కల్పిస్తు న్నామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే నీట్, ఎంసెట్‌కు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. సు దూర ప్రాంతాలకు వెళ్లకుండానే బిఎస్‌సి, బికాం, బిఎ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి మూడు నెలలకోసారి పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తూ, విద్యార్థుల సందేహాలను వారి ద్వారా నివృత్తి చేసుకోనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేలా ఆటపాటలతో పాటు పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చైతన్య పరుస్తున్నామన్నారు. వరద బాధితులకు సాయంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతోందన్నారు. గత 13 ఏళ్లగా అంకితభావంతో విద్యావిధానంలో సమూల మార్పులు చేసుకుంటూ నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. సుదూర ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం అన్ని రూట్లలోనూ బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అన్ని వసతులతో ప్రశాంతమైన విశాల ప్రాంగణంలో అత్యుత్తమ ఫలితాలు అందిస్తున్న శ్రీ సుగుణ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులను చేర్పి, కళాశాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ రాజమణి కోరారు.

శ్రీసుగుణ కళాశాల

బెట్టింగ్ వలలో యువత..!

క్రికెట్ బెట్టింగ్‌లు ఆడడంతో జీవితాలు ఛిద్రం
అప్పులపాలవుతున్న వైనం
తతంగం అంతా ఆన్‌లైన్‌లోనే
దుబాయ్, గోవా కేంద్రాలుగా బెట్టింగులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

బెట్టింగ్ యాప్‌లను ఆశ్రయించిన యువత బలవుతున్నారు. చిన్నపాటి ఆశతో బెట్టింగ్‌లో వేలు పెట్టి అప్పుల ఊబిలో కూరకుపోయి శరీరాన్ని దహించుకుంటున్నారు. ఇంట్లోవారికి తెలియకుండా అప్పులు చేసి వాటిని తీర్చలేక సమత మవుతున్నారు. చేసిన అప్పులను తీర్చడం కోసం దొడ్డిదారిలో లోన్ యాప్‌లను ఆశ్రయించి మరింత నష్టాల్లోకి జారుకుంటున్నారు. కొంతమంది చైన్ స్నాచింగ్, దొంగతనాలకు పాల్పడుతుండగా మరికొందరు మత్తు, మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారు. ఐపిఎల్ సీజన్‌లో బెట్టింగ్ దందా మరోసారి బుసలు కొడుతోంది. పోలీసులకు చిక్కకుండా దుబాయ్, గోవా తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఉంటూ ఇక్కడి వారితో బెట్టింగ్‌లు కాయిస్తున్నారు.



బెట్టింగ్‌లో చిక్కితే భవిష్యత్తు అంధకారమే

ఈజీ మనీకి అలవాటుపడిన యువత చెడుమార్గాన్ని విడనాడి సన్మార్గంలో నడవాలి. బెట్టింగ్‌లో పట్టుబడితే భవిష్యత్తు అంధకారమే. పోలీసులు కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా, విదేశాలకు వెళ్లాల్సి వస్తే ఇబ్బందులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

టాస్ నుంచి మొదలు...

టాస్ మొదలు కొని స్కోర్, గెలుపు, ఓటమి, ఆటగాడి పరుగులు, వికెట్ ఇలా అన్నింటిపైనా పందాలు కాస్తుంటారు. గతంలో రహస్య లాడ్జీలను తీసుకుని టీవీలను చూస్తూ పందాలు నిర్వహించగా ప్రస్తుతం చరవాణీల్లోనే బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

సీక్రెట్ కోడ్‌ల ద్వారానే.. అంతా...

ఐపిఎల్ సీజన్ కావడంతో పాత పద్ధతిలో సీక్రెట్ కోడ్‌లు వాడుతూ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. రహస్య సంకేతాలను వినియోగించడంతో పాటు వాట్సాప్ కాల్‌లో తతంగం పూర్తి చేస్తున్నారు. బుకీల వద్ద పందాలు కాసే వారంతా కోడ్ భాషను వినియోగిస్తారు. వారివద్ద రిజిస్టర్ అయిన చరవాణి నెంబర్ నుంచి ఫోన్ వస్తేనే మాట్లాడుతారు. లెగ్ అనే పదం బెట్టింగ్ రాయుళ్ల వాడే కోడ్ భాషలో ప్రధానమైంది. ఎవరు ఎన్ని లెగ్‌లు తీసుకుంటే అన్నింటికీ లెక్క కట్టి మొత్తం చెల్లించాలి. గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్న జట్టుపై బెట్టింగ్ పెడితే ఫ్లయింగ్, తక్కువగా ఉన్న జట్టుపై బెట్టింగ్ పెడితే ఈటింగ్ అనే పదాలను వాడుతున్నట్లు సమాచారం. మ్యాచ్ జరిగే రోజునే అప్పటికప్పుడు లావాదేవీలను నిర్వాహకులు పూర్తిచేసి పేమెంట్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తారు.

బ్యాంకు ఖాతాలను తెరిపిస్తున్న బెట్టింగ్ రాయుళ్లు

బెట్టింగ్ కాసేవారు, పందెం గెలిచిన వారికి డబ్బులు ఇచ్చేందుకు నిర్వాహకులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్‌తో ఆరా రాకుండా ఉండేందుకు కొత్తగా కరెంట్ అకౌంట్స్ ఓపెన్ చేయిస్తే వారానికి సంబంధిత బ్యాంకు ఖాతాకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు ఉచితంగా చెల్లిస్తామని దళారులకు వల వేస్తున్నారు. ఈ క్రమంలోనే ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకుడికి తెలియకుండానే ఉండి మండలం కోలమూరులో ఓ బ్యాంకులో కరెంటు ఖాతా ఓపెన్ చేయడంతో అతనికి చెక్‌బుక్, ఎటిఎం కార్డు పోస్టులో వచ్చింది. దీంతో అసలు తాను ఎలాంటి కరెంట్ అకౌంట్ తీసుకోలేదని, తన ప్రమేయం లేకుండా ఎవరో కావాలని చేసారని పోలీసులను ఆశ్రయించారు. ఇదే ముఠా ఇలాంటి బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయిస్తున్నట్లు ప్రచారంలో నడుస్తోంది.

పారిశ్రామిక అభివృద్ధికి కృషి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్
ఎంఎస్‌ఎంఇ పార్క్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసి రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్న సిఎం ఆశయాలకు అనుగుణంగా జిల్లాల్లోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్‌ఎంఇ పార్కును నెలకొల్పుతామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు. మండలంలోని పట్టాయగూడెంలో 70 ఎకరాల్లో ఏర్పాటుచేసిన ఎంఎస్‌ఎంఇ పార్క్ పనులకు గురువారం జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌తో కలిసి ఎంపి పుట్టా మహేష్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధిలో నిలిపేందుకు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఇ పార్క్ నెలకొల్పి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని సిఎం లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో అధికారుల పాత్ర ప్రశంసనీయమన్నారు. సిఎం సూచనలతో పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుని, దాదాపు నాలుగు వేల ఎకరాలతో ల్యాండ్ బ్యాంకును ఏర్పాటు చేశారన్నారు. ఎంఎస్‌ఎంఇ పార్క్ ఏర్పాటుకు కలెక్టర్‌కు ప్రతిపాదన చేసిన వెంటనే చింతలపూడి నియోజకవర్గంలో రికార్డ్ సమయంలో నెలరోజుల్లో 70 ఎకరాల భూమిని గుర్తించడం, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి అనుమతులు వచ్చేలా చేయడం అభినందనీయమన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ చింతలపూడిని అన్ని రంగాల్లో ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనతో మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే అధికారులు, ప్రజాప్రతినిధుల టీమ్ ఉండడం గొప్ప విషయమన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఇ పార్క్ ఏర్పాటుకు కోరిన వెంటనే నెలరోజుల్లోగా భూమి కేటాయింపు, ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు చేయించినట్లు తెలిపారు. చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు. ఎంఎస్‌ఎంఇ పార్క్ ఏర్పాటు ద్వారా నియోజకవర్గంలో యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చన్నారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో మరింత మెరుగైన సేవలందించే దిశగా అభివృద్ధి చేశామన్నారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ విధానం కొన్నిరోజుల్లోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ బాబ్జి, మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ రామకృష్ణ, సర్పంచి వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణేశ్వరరావు, ప్రముఖులు ముత్తారెడ్డి, దాసరి శేషు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, జెడ్‌పి చైర్‌పర్సన్, కలెక్టర్, ఎంఎల్‌ఎ

నోటీసులు జారీ చేస్తాం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అనధికార లేఅవుట్లను గుర్తించి నోటీసులు జారీ చేస్తామని మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్ పవన్ కుమార్ అన్నారు. ప్రజాశక్తి దినపత్రికలో గురువారం అనధికార లేఅవుట్లపై అడిగేవారేరి అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ వార్తపై స్పందించిన ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో అనధికార లేఅవుట్లను గుర్తించి స్థల యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ఎవరైనా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చే వ్యక్తులు తప్పనిసరిగా ప్రభుత్వానికి పన్ను చెల్లించాలన్నారు. అలా చెల్లించకుండా ఎవరైనా అనధికారి లేఅవుట్లు ఏర్పాటు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ లేఅవుట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, అనధికార లే అవుట్లలో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నూజివీడు తహశీల్దార్‌గా భద్రు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు తహశీల్దార్‌గా జి.భద్రు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా భద్రు మాట్లాడుతూ ఇప్పటివరకు ఉయ్యూరు ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒగా విధులు నిర్వర్తించి నూజివీడు తహశీల్దార్ బదిలీపై వచ్చినట్లు తెలిపారు. గత 12 ఏళ్ల క్రితం నూజివీడు ఆర్‌ఐగా బాధ్యతలు నిర్వర్తించానని చెప్పారు. నూజివీడు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా ఇప్పటివరకు పని చేసిన సుబ్బారావు యధావిధిగా నూజివీడు తహశీల్దార్ కార్యాలయంలో డిటిగా విధులు నిర్వహిస్తున్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

నిరుపేద కుటుంబానికి జనసైనికులు ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన జనసేన మండల ప్రధాన కార్యదర్శి వేట త్రినాధ్ తండ్రి వేట రాంబాబు గత నెలలో ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స ఖర్చుల నిమిత్తం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరపున, కూటమి ప్రభుత్వం తరపున జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు పాశం నాగబాబు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు బెజవాడ కిషోర్, చేకూరి అనిల్, బయ్యం సతీష్, గుండాల శివ, కేశవ, ఉప్పే పవన్ తదితరులు పాల్గొన్నారు.

సేవకులు రెడ్ క్రాస్ సభ్యత్వం పొందాలి

ప్రపంచ రెడ్ క్రాస్, ప్రపంచ తలసేమియా దినోత్సవాల వేడుకలో ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవ వేడుకలను ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ మాగంటి ప్రసాద్, కమిటీ సభ్యులు రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాగంటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న అతిపెద్ద మానవతావాద సంస్థ రెడ్ క్రాస్ సొసైటీ అని, సుమారు 1.60 కోట్ల మంది రెడ్ క్రాస్ వాలంటీర్లు, సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. జిల్లాలోని రెడ్‌క్రాస్ సేవలను కలెక్టర్ సహకారంతో మరింత విస్తృతం చేస్తామని, ప్రతి మండలంలోనూ రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి చిన్నారులకు అవసరమైన రక్త పరీక్షలను రెడ్‌క్రాస్ ల్యాబ్‌లో చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సేవా భావం గల వ్యక్తులందరూ రెడ్ క్రాస్ సంస్థలో జీవితకాల సభ్యత్వం పొందాలని కోరారు. అనంతరం బ్లడ్ సెంటర్‌లోని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రెడ్ క్రాస్ వాలంటీర్లతో ప్రభుత్వాసుపత్రి నుంచి ఫైర్ స్టేషన్ మీదగా రెడ్ క్రాస్ భవనం వరకు తలసేమియా వ్యాధిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రెడ్ క్రాస్ రక్తమార్పిడి కేంద్రంలోని రక్తమార్పిడి చికిత్స పొందుతున్న 15 మంది తలసేమియా చిన్నారులకు పండ్లను, ప్రోటీన్ పౌడర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ జె.సత్యనారాయణ రాజు, ట్రెజరర్ ఎన్.బ్రహ్మానందం, డాక్టర్ వరప్రసాదరావు, కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, రెడ్ క్రాస్, ఎఎన్ఎం విద్యార్థినులు, సిఆర్.రెడ్డి ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

వినోదభరితంగా వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు పదో రోజు గురువారం కూడా ఎంతో వినోద భరితంగా సాగాయి. శిక్షణా తరగతులకు విద్యార్థులు చాలా హుషారూగా పాల్గొంటు న్నారు. ఈ శిక్షణ తరగతులను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు పరిశీలించారు. తొలుత విద్యార్థు లచే గ్రంథాలయ సిబ్బంది పుస్తక పఠనంలో నీతి కథలను చదివించి నీతిని వివరించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ కె.తరుణ్ విద్యార్థులకు ఫిజికల్ సైన్స్, న్యాచురల్ సైన్స్ అంటే ఏమిటి మొక్కలు, హార్మోన్స్, అహార పదార్థాలు, క్రమశిక్షణ, స్టాటిక్స్, డైనమిక్స్, ఫోర్స్, యూనిట్లు, ఉష్ణోగ్రత ఇతర వాటి పై శిక్షణ ఇచ్చారు. అనంతరం రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు రంగురంగు కాగితాలతో (పేపరు క్రాఫ్టులు) గ్రీటింగ్స్ తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్ పి.శంకర్ డ్రాయింగ్ శిక్షణా తరగతులను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణ రావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్ కుమార్, ఎండి.అస్లాం పాషా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి :స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణ సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. టివి, సెల్ ఫోన్‌కు దూరంగా ఉంటూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని, మిత్రులతో కలిసి ఆటపాటలతో గడపాలని సూచించారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం పోటీలను తహశీల్దార్ రామకృష్ణ పరిశీలించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు తెలిపారు. పలు పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

అడవులను సంరక్షించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అడవులను పరిరక్షించాలని కోరుతూ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ శుభంకు బంజారా భజరంగీ భేరి సంఘం నాయకులు భూక్యా నాగరాజు నాయక్, జరభల వెంకట కృష్ణప్రసాద్ గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను కొంతమంది దుండగులు విచ్చలవిడిగా తగలబెట్టడం, అక్రమంగా నరికి వేయడం వల్ల జిల్లాలో అడవులు చాలా వేగంగా అంతరించిపోతున్నాయన్నారు. జీవ సమతుల్యత దెబ్బతింటుందని, పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. అడవుల పరిరక్షణ కోసం గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అవేర్నెస్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, సామాజిక బాధ్యతలో భాగంగా అడవులను పెంచడం కోసం వర్షాకాలంలో బంజారా భజరంగి భేరి సంఘానికి అటవీ శాఖ నుంచి విత్తనాలు, మొక్కలు ఇవ్వాలని కోరారు. జిల్లా అటవీ శాఖాధికారి శుభం సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే అడవుల పరిరక్షణపై అవేర్నెస్ క్యాంపులు పెడతామని, అడవుల రక్షణ ఉద్యమంలో ముందుకొచ్చిన సామాజిక సేవా సంఘాలకు కావాల్సిన మొక్కలు అటవీ శాఖ నుంచి అందిస్తామని చెప్పారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల తొమ్మిదో తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్.అహ్మద్ ఖాన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చింతలపూడి 132/33 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 33 కెవి సీతానగరం ఫీడర్ వద్ద ఉన్న 33/11 కెవి అల్లిపల్లి సబ్ స్టేషన్ మెయింటెనెన్సు, 33/11 కెవి లింగగుడెం సబ్ స్టేషన్ పరిధిలోని చింతంపల్లి ఫీడర్ ట్రీ కటింగ్, 33 కెవి టి.నర్సాపురం ఫీడర్, ట్రీ కటింగ్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని ఆయా ఫీడర్లలో విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

జీలుగుమిల్లి : జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని మైసన్నగూడెం ఫీడర్‌పై చెట్ల కొమ్మలు నరుకడం, విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మండలంలోని ములగలంపల్లి, పి.నారాయణపురం, రాచన్నగూడెం సబ్ స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జంగారెడ్డిగూడెం డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

ఏలూరు :శాంతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి కట్టా సుబ్బారావు తోట ఫీడర్‌కు వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల తొమ్మిదో తేదీ శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా కట్టాసుబ్బారావు తోట, బిజెవియర్ నగర్, శాతవాహన నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

కొయ్యలగూడెం :కొయ్యలగూడెం సెక్షన్ పరిధిలోని బోడిగూడెం సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఈ నెల తొమ్మిదో తేదీ శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ ఇఇ అహమ్మద్ ఖన్ తెలిపారు.

తాగునీటి పైపులైన్ ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని శ్రీహరిపురం గ్రామపంచాయతీ పరిధిలో పాముల దిబ్బపై ఉన్న 20 కుటుంబాలకు తాగునీటి పైపులైన్‌ను గురువారం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి బత్తుల నాగేశ్వరమ్మ, వార్డ్ మెంబర్లు, కూటమి నాయకులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్త నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి - ముసునూరు

బలివే శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తగా నియమించేందుకు నోటిఫికేషన్ వెలువడినట్లు ఆలయ ధర్మకర్త అలివేణి నాగలక్ష్మి దేవి తెలిపారు. మండలంలోని బలివే గ్రామంలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆమె విలేకర్లతో మాట్లాడుతూ బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా నియమితులయ్యేందుకు ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌పై యూత్ కాంగ్రెస్ ప్రశంస

ప్రజాశక్తి నూజివీడు టౌన్

ఆపరేషన్ సిందూర్‌పై యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్‌కుమార్ ప్రశంసలు కురిపించారు. నూజివీడు పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సైనికులకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. దేశ భద్రతను కాపాడే యోధులను చూసి గర్వంగా ఉందన్నారు.

దాడి దారుణం

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలు, ఎడిటర్లపై దాడులు పెరిగాయని, ఇటువంటివి జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ అజాద్ కోరారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా సోదాలు జరపడం పట్ల ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఖండిస్తుందన్నారు. చింతలపూడి సిఐ రాజశేఖర్‌కు ప్రెస్‌క్లబ్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ తరపున వినతిపత్రం అందించారు.

ప్రకటన
మహారాజశ్రీ పాలకొల్లు అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S. No.65/2024
Between:-
Plaintiff :- Ethakota Nirmala
And
Defendant :- Pamba Pandu Babu
To.
Defendant :-
Pamba Pandu Banu, S/o.Koteswara Rao, R/o. D.No. 28-7-9, Pedapeta, 16th Ward, Palakol, Palakol Mandal, W.G.Dt.,
పై నెంబరు దావాలో ప్రతివాది హాజరు నిమిత్తం ది. 15-05-2025వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట ఉదయం గం. 10:30 ని॥లకు స్వయంగా కానీ, న్యాయవాది గారి ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు దావా ముందు గ్రంధము జరుపబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ నిడుమోలు ఆనంద చక్రవర్తి
శ్రీ రావి దేవరాజు
న్యాయవాదులు
పాలకొల్లు - ప॥గో॥జిల్లా
పాలకొల్లు
తేది:08-05-2025